క్లుప్తంగా

రేపటి విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి



ధర్నా చౌక్‌లో నిరసన తెలుపుతున్న నాయకులు

నిజామాబాద్ అర్బన్: ఫీజుల నియంత్రణ చట్టాన్ని తేవాలని డిమాండ్ చేస్తూ బుధవారం చేపట్టే విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు నాగరాజ్ అన్నారు. సోమవారం వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేయాలన్నారు. ఈ నిరసనలో వామపక్ష విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

సిరికొండ: మండలంలోని రావుట్ల గ్రామంలో ఎమ్మెల్సీ కవిత మంజూరు చేసిన నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. మాజీ వైస్ ఎంపీపీ తోట రాజన్న, మాజీ ఉపసర్పంచ్ రఘువాస్, వీడీసీ చైర్మన్ భూమయ్య, శ్రీనివాస్, రాజేందర్, పెద్ద భూమయ్య, మైసి సాయన్న, బాలరాజు, సాయిలు, తాహెర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలపై నిఘా పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న వీడీసీ సభ్యులు

సిరికొండ: మండల కేంద్రంలో మత్తు పదార్థాల విక్రయంపై నిఘా పెంచాలని ఎస్సై రామకృష్ణను సిరికొండ వీడీసీ సభ్యులు కోరారు. ఎస్సైని వారు సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. వాహనాల తనిఖీల్లో స్థానికులకు మినహాయింపు ఇవ్వాలని, పొలం వద్దకు వెళ్లే వారికి హెల్మెట్ లేదని జరిమానాలు విధిస్తున్నారని వీడీసీ సభ్యులు ఎస్సైకి తెలిపారు. వీడీసీ చైర్మన్ స్వామి, వైస్ చైర్మన్ రామస్వామి, మంగళి మోహన్, భూమరెడ్డి, లక్ష్మణ్, రాజలింగం, గంగాధర్, సంజీవ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు శివ

నిజామాబాద్ అర్బన్ : ఒడిస్సాలో అత్యాచారానికి పాల్పడిన ఎస్ఎస్‌యూఐ నాయకుడిపై చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యులు శివ డిమాండ్ చేశారు. నగరంలో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒడిస్సాలో ఎఎస్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షులు ఉదిత్ ప్రధాన్ ఇంజినీరింగ్ విద్యార్థినిపై అత్యాచారానికి పాల్పడి పోలీసులకు లొంగిపోయాడన్నారు. ఈవిషయం సిగ్గ చేటన్నారు. ఈ సమావేశంలో ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అమృత చారి, తెలంగాణ యూనివర్సిటీ అధ్యక్షులు సాయికుమార్, దినేష్, అల్తాఫ్, ఆకాష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 10 నుంచి జలాల్ బుకారి దర్గా ఉర్సు

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని రెంజల్ బేస్‌లోగల జలాల్ బుకారి దర్గ ఉర్సు ఉత్సవాలు ఆగస్టు 10వ తేదీ నుంచి సజ్జదే నశీ ముక్తెదార్, ఉర్సు కమిటీ ప్రధాన కార్యదర్శి యూనుస్ పటేల్ తెలిపారు. సోమవారం ఉర్సు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ ఉర్సు ఉత్సవాలు 10,11,12 మూడు రోజుల పాటు సాగుతాయని పేర్కొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	99,200	వెండి(కిలో)	1,18,000
22 క్యారెట్స్	91,575	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	140
		లైవ్	100
స్కిన్‌లెస్	180	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

కూరగాయ	హోల్‌సేల్	రిటైల్	కూరగాయ	హోల్‌సేల్	రిటైల్
టమాట	24	50	గాజరుగడ్డ	30	60
బెండకాయ	40	70	పచ్చిమిర్చి	60	100
బీరకాయ	20	40	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	25	50
బీర్నిసుకాయ	50	80	గోబిగడ్డ	15	30
కాకరకాయ	30	50	గోబిపువ్వు	40	70
వంకాయ	40	60	బీట్‌రూట్	30	60
పాలకూర	20	40	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	30	50
కొత్తిమీర	15	30	చిక్కుడుకాయ	40	70
పుదీనా	60	90	గోరుచిక్కుడు	40	80
క్యాప్సికం	50	90			

–సుభాష్‌నగర్

హడలెత్తిస్తున్న శునకాలు

- నగరంలో గుంపులుగా తిరుగుతున్న పరిస్థితి
- రాత్రివేళ వెంటపడటంతో ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- సాఫీగా సాగని కుక్కల పట్టివేత
- దృష్టిసారించని బల్దియా అధికారులు



సాయినగర్‌లో తిరుగుతున్న కుక్కలు

నిజామాబాద్ సిటీ: బల్దియా పరిధిలో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. ప్రజలను హడలెత్తిస్తున్నాయి. నగరంలో 20 వేల వరకు శునకాలున్నాయి. ఏబీసీ సెంటర్ నెలకొల్పినా అది నామ మాత్రంగానే పనిచేస్తోంది. ప్రతి రోజు వీధుల్లో హల్‌చల్ చేస్తున్న కుక్కల్ని పట్టి వాటికి కు.ని. చేయాలి. కానీ, శానిటేషన్ అధికారులు ఆ ప్రయత్నం చేయడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

వెంటనే వాక్సిన్ వేయించాలి..

కుక్కలు కాటువేసినా, గీరినా, వాటిగోళ్లు మన చర్మం మీద పడి రక్తం వచ్చినా వెంటనే ఏఆర్‌బీ వాక్సీన్ (యాంటీ రేబిస్ వాక్సిన్) వేయించాలి. ప్రభుత్వ ఆస్పత్రిలో నాలుగుసార్లు ఈవాక్సిన్ ఉచితంగా వేస్తారు. సరియైన చికిత్స తీసుకోకుంటే ప్రాణాపాయ పరిస్థితి ఏర్పడే ప్రమాదముంది.



గాయత్రినగర్‌లో రాత్రిపూటతిరుగుతున్న కుక్కలు



ఏబీసీ సెంటర్‌లో పట్టిన కుక్కలు

ఏబీసీ సెంటర్..

బల్దియా అధికారులు కుక్కల నియంత్రణకు యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్‌ను ఏర్పాటుచేశారు. దానికి శానిటరి ఇన్‌స్పెక్టర్ సాల్మన్ రాజును ఇన్‌చార్జిగా నియమించారు. కుక్కలను బంధించే పనులను బజరంగ్ జవాన్‌కు అప్పగించారు. ప్రతి రోజు కుక్కలను బంధించి తీసుకువచ్చి వాటికి సంతానం కలగకుండా కుటుంబ నియంత్రణచేయడంలో మాత్రం అధికారులు విఫలమవుతున్నారు. కు.ని కోసం ఓ ఏజెన్సీ టెండర్లు దక్కించుకుంది. కు.ని కార్యక్రమం మాత్రం సాఫీగా సాగడం లేదు. ఇప్పటివరకు వెయ్యికి పైగా కుక్కలకు కు.ని చేసినట్లు లెక్కల్లో ఉన్నా.. చాలా వాటికి కు.ని చేయలేదనే ఆరోపణలున్నాయి.

ప్రాణాలు పోతున్నా పట్టింపేది..



బబన్‌సాహెబ్ పహాడ్‌లో బాలుడికి కుక్కకాటు గాయాలు (ఫైల్)

నగరంలోని ఖలీల్‌వాడి, కోటగల్లి, పూసలగల్లి, గాయత్రినగర్, సాయిప్రియనగర్, శివాజీనగర్, ఆనంద్‌నగర్ కాలనీ, గాజుల్‌పేట్, వినాయక్‌నగర్, 100 ఫీట్ల రోడ్డు, దుబ్బ, అరుందతీనగర్ తదితర కాలనీల్లో ఎక్కువగా కుక్కలు సంచరిస్తున్నాయి. రాత్రి వేళ కుక్కలు గుంపులు గుంపులుగా చేరి రోడ్లమీదకు వస్తున్నాయి. వాహనదారులు వెంటపడటంతో ప్రమాదాల బారిన పడుతున్నారు.ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లలపై దాడులు చేస్తున్నాయి. గత నెలలో మాలపల్లిలో కుక్కకాటుకు గురైన ఐదేళ్ల బాలుడు నెల తర్వాత మృతిచెందడం కలచి వేసింది .ప్రాణాలు పోతున్నా బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. రోజుకు 6 నుంచి ఏడు కుక్క కాటు కేసులు జీజీహెచ్‌కు వస్తున్నట్లు తెలుస్తోంది.

వెంటపడుతున్నాయి

డ్యూటీ ముగించుకుని ఇంటకి వస్తుంటే కుక్కలు వెంటపడుతున్నాయి. గుంపులు గుంపులుగా రావడంతో కొన్నిసార్లు భయం అవుతోంది. బల్దియా అధికారులు వీధి కుక్కలను తీసుకెళ్లాలి. టోల్‌ఫ్రీ నెంబర్ ఇస్తే చాలా మంది ఫోన్‌లు చేసి సమాచారం అందిస్తారు. – గట్ల రాజు, శివాజీనగర్

త్వరలోనే ఏబీసీని పునరుద్ధరిస్తాం



కుక్కలను పట్టే కార్యక్రమం సాఫీగా సాగుతోంది. రోజు రాత్రి రెండు బృందాలు వెళ్లి కుక్కలను పట్టుకొస్తున్నాయి. జవాన్ బజరంగ్ ఈ పనులు పర్యవేక్షిస్తున్నారు. కుక్క కరిచినా, వాటిగోళ్లు మనకు పడినా వెంటనే వా క్సిన్ తీసుకోవాలి. అశ్రద్ధ చేయవద్దు. – సాల్మన్‌రాజు, శానిటరి ఇన్‌స్పెక్టర్, ఏబీసీ ఇన్‌చార్జి

అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తాం



తిర్మన్‌పల్లిలో రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి: అర్హులందరికీ రేషన్ కార్డులు ఇస్తామని రూరల్ ఎమ్మెల్యే డా. భూపతి రెడ్డి అన్నారు. మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 23,177 నూతన కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వకుండా పేదలను మోసం చేసిందని విమర్శించారు. రేషన్ కార్డుల కోసం దళారులను ఆశ్రయించి డబ్బులు ఇవ్వవద్దని, మీ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే పారదర్శకంగా విచారణ చేసి కార్డులు జారీ చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు జరుగుతుండటమే నిదర్శనమన్నారు. కార్యక్రమంలో డీసీవో శ్రీనివాస్, తహసీల్దార్ వెంకట్‌రావు, ఏఎంసీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్ నాయక్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్ గౌడ్, ఇమ్మడి గోపి, సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నీరు నిల్వ ఉండకుండా చూడాలి



కుండీల్లోని నీటిని తొలగిస్తున్న వైద్య సిబ్బంది

డిచ్‌పల్లి: వానకాలంలో వచ్చే సీజనల్ వ్యాధులపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని మండల వైద్యాధికారిణి డాక్టర్ క్రిస్టినా సూచించారు. ఇందల్వాయి పీహెచ్ సీ ఆధ్వర్యంలో సోమవారం నడిపల్లి తండాలో ఉచిత ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరానికి సంబంధించి రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేశారు. తండాలో ఇంటింటికి తిరిగి నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి నీటిని తొలగించారు. ఈ సందర్భంగా డాక్టర్ క్రిస్టినా మాట్లాడుతూ.. నీరు నిల్వ ఉంటే దోమలు పెరిగి తద్వారా మలేరియా, డెంగీ, చికున్ గున్యా, ఫైలేరియా, మెదడువాపు తదితర వ్యాధులు వ్యాపిస్తాయన్నారు.

దోమలను నివారించేందుకు నిల్వ ఉన్న నీటిని తొలగించి ఇళ్ల చుట్టూ, పరిసర ప్రాంతాల్లో డెమోపాస్ స్ప్రే చేశామన్నారు. ఆశాకార్యకర్తలు అన్ని గ్రామాల్లో జ్వర సర్వే నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్ గౌడ్, ఆరోగ్య విస్తీర్ణాధికారి శంకర్, పంచాయతీ కార్యదర్శి జయశ్రీ, ఆరోగ్య పర్యవేక్షకులు అక్బర్‌అలీ, ఆరోగ్య కార్యకర్తలు వెంకట్ రెడ్డి, సుజాత, శోభ, మహాలక్ష్మీ, ఆశా కార్యకర్తలు సునీత, లత, విజయ తదితరులున్నారు.

ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలి



మాట్లాడుతున్న అబ్బాస్

నిజామాబాద్ సిటీ : అమెరికా యుద్ధోన్మాదం మానవాళికి చాలా ప్రమాదకరమని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు అబ్బాస్ అన్నారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. యుద్ధోన్మాదుల చర్యలను ప్రతిఒక్కరూ ఖండించాలని పిలుపునిచ్చారు. ఇటీవల సంగారెడ్డి వద్ద సిగాచీ పరిశ్రమలో చోటుచేసుకున్న ప్రమాదంలో కార్మికుల కుటుంబాలు రోడ్డునపడ్డాయన్నారు. అన్ స్కిల్డ్ కార్మికులతో పనులు చేయించడం దుర్మార్గమన్నారు. ప్రజా ఉద్యమాలకు శ్రీకారం చుట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ప్రజలను చైతన్యంచేసి నడిపించేందుకు నిరంతరం అధ్యయనం చేస్తుండాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రమేష్ బాబు, పెద్దివెంకట్రాములు, నూర్జహాన్, పల్లపు వెంకటేశ్, శంకర్ గౌడ్, జంగం గంగాధర్, నన్నేసాబ్, కొండ గంగాధర్, సుజాత, విఘ్నేష్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో వెటర్నరీ సబ్ సెంటర్

- గొట్టిముక్కలలో భయంగా విధులు నిర్వహిస్తున్న పశువైద్యులు
- నూతన భవనం మంజూరు చేయాలని వినతి



వెటర్నరీ సబ్‌సెంటర్ ముందుభాగం



వెటర్నరీ సబ్‌సెంటర్ లోపలిభాగం

మాక్లూర్ : మండలంలోని గొట్టిముక్కల వెటర్నరీ సబ్‌సెంటర్ శిథిలావస్థకు చేరింది. ఏళ్లు గడుస్తున్న పాలకులు పట్టించుకోవడంలేదు. సబ్‌సెంటర్ ఎప్పుడు కూలుతుందో తెలియని దుస్థితిలో ఉండటంతో పశువైద్యులు భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. సమీపంలోని 10 గ్రామాల రైతులు తమ పశువులను వైద్యం కోసం ఇక్కడికే తీసుకువస్తారు. ఈసబ్‌సెంటర్‌లో జూనియర్ పశువైద్యులు కల్యాణి, ఆఫీస్ సబార్డినేట్ శ్యామలలు పశువులకు వైద్యం అందిస్తున్నారు. సబ్‌సెంటర్ చుట్టూ పెద్ద చెట్లు, ముళ్లపొదలు, గడ్డిపెరిగిపోయి పాములు వస్తున్నాయి. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారడంతో మురుగునీరు వచ్చి ఆస్పత్రి ప్రాంగణంలో నిలుస్తోంది. దీంతో దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని పశువైద్య సిబ్బంది వాపోతున్నారు. వర్షకాలంలో మరిన్ని ఇబ్బందులు పడాల్సి ఉంటుందని పశువైద్య సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాలకులు స్పందించి నూతన భవనం లేదా ఉన్న భవనానికి మరమ్మతులు చేయించాలని స్థానిక రైతులు, పశుపెంపకందారులు కోరుతున్నారు.



సబ్‌సెంటర్ వెనుకభాగంలో ఓ మూలపై పెద్ద చెట్టు

కొత్త భవనం నిర్మించాలి



సబ్‌సెంటర్ శిథిలావస్థకు చేరింది. నూతన భవనం నిర్మించడానికి ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి నిధులు మంజూరు చేయించాలి. నూతన భవనం నిర్మించాలి.

– గంగాధర్, రైతు, రాంపూర్

డ్యూటీ చేయాలంటే భయంగా ఉంది



సబ్‌సెంటర్ శిథిలావస్థకు చేరింది. చుట్టూ ముళ్లపొదలు పెరిగిపోవడంతో పాములు వస్తున్నాయి. డ్యూటీ చేయాలంటే భయంగా ఉంది. సెంటర్‌లో కూర్చోవాలంటే భయంగా ఉంటుంది. అధికారులు, పాలకులు స్పందించి మరమ్మతులు చేయించాలి. లేదా కొత్త భవనం నిర్మించాలి. – కల్యాణి, వెటర్నరీ సెంటర్ జూనియర్ పశువైద్యురాలు, గొట్టిముక్కల

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లాం



పశువుల ఆస్పత్రి సబ్‌సెంటర్ శిథిలావస్థకు చేరింది. ఈ విషయమై ఇటీవలే ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌దృష్టికి తీసుకెళ్లాం. కొత్త భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

– ముప్పా గంగారెడ్డి, రైతు, గొట్టిముక్కల

తెలంగాణ సంస్కృతికి నిదర్శనం బోనాలు



బోనాల పండుగలో పాల్గొన్న కేశ వేణు



బోనాలు తీసుకెళ్తున్న ట్రాన్స్‌జెండర్లు

నిజామాబాద్ సిటీ : నగరంలోని బహుజన కాలనీలో బండ పోచమ్మ బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ వేడుకలకు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, నుడా చైర్మన్ కేశ వేణు హాజరయ్యారు. బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ట్రాన్స్‌జెండర్స్ అసోసియేషన్ నాయకులు గంగ, జరీనా, రక్షలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. బోనాల ఊరేగింపు సందర్భంగా జోగిని సుచిత్ర విన్యాసాలు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా నుడా చైర్మన్ కేశ వేణు మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి బోనాలు నిదర్శనమన్నారు. ఆషాఢ మాసంలో అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకోవడం ద్వారా ప్రజలు సుఖశాంతులతో, పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు రామర్తి గోపికృష్ణ, వేణురాజ్, పార్థసారథి, రాజేష్, మల్యాల గోవర్ధన్‌లతోపాటు బహుజన కాలనీవాసులు గంగ, జరీనా, రక్ష, మారుతి, అలీ, లక్ష్మీ, షాదుల్ ఖాన్‌లు పాల్గొన్నారు.

గురువులు మార్గదర్శకులు



కోట్‌గిర్‌కర్ పాయల్‌ను సన్మానిస్తున్న జిల్లా గ్రంథాలయ చైర్మన్, సంస్కార భారతి సభ్యులు

నిజామాబాద్ రూరల్ : నగరంలోని సంస్కార భారతి ఆధ్వర్యంలో ప్రైవేట్ పాఠశాలలో సోమవారం ఘనంగా గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువులను, కళాకారులను సన్మానించారు. అనంతరం జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతిరెడ్డిరాజిరెడ్డి మాట్లాడుతూ ప్రతి మనిషికి మార్గదర్శకులుగా గురువులు ఉంటారని పేర్కొన్నారు.

బీసీ రిజర్వేషన్ల తీర్మానాన్ని స్వాగతిస్తున్నాం



మాట్లాడుతున్న బీసీటీయూ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్

నిజామాబాద్ అర్బన్ : బీసీ రిజర్వేషన్లపై తీర్మానాన్ని స్వాగతిస్తున్నామని, ఆర్డినెన్స్ ద్వారా బీసీ రిజర్వేషన్ల పెంపు అభినందనీయమని బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు మాడవీటి వినోద్ కుమార్ అన్నారు. సోమవారం నగరంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గల్లీ నుంచి ఢిల్లీ వరకు బీసీలు పోరాటం చేస్తేనే ఫలితం దక్కిందన్నారు. ఆగస్టు 7న గోవాలో 10,000 మంది బీసీ ప్రతినిధులతో ఓబీసీ మహాసభ నిర్వహిస్తున్నారని, ఈసభలో బీసీలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో బీసీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, అసోసియేటెడ్ అధ్యక్షులు మోహన్, గౌరవాధ్యక్షులు బాబు తదితరులు పాల్గొన్నారు.

కాన్షీరాం అడుగుజాడల్లో నడవాలి



సమావేశంలో మాట్లాడుతున్న నీరడి లక్ష్మణ్

నిజామాబాద్ నాగారం : బహుజనులు కాన్షీరాం అడుగుజాడల్లో నడవాలని రూరల్ నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జి నీరడి లక్ష్మణ్ పేర్కొన్నారు. సోమవారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో నిర్వహించిన బహుజన సమాజ్‌వాదీ పార్టీ నిజామాబాద్ మండల కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రూరల్ నియోజకవర్గం లో పార్టీని బలోపేతం చేయడానికి మండల కమిటీలు, గ్రామ కమిటీలు, సెక్టార్ కమిటీలు, బూత్ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం అధ్యక్షులు పోతే ప్రవీణ్, నియోజకవర్గం ప్రధాన కార్యదర్శి సున్నం నరేష్, నియోజకవర్గం కార్యదర్శి ప్రభుదాస్, నిజామాబాద్ మండల అధ్యక్షులు గడ్డం రవి, బీఎస్పీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలపై ప్రత్యేక దృష్టి సారించాలి



నవీపేట పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను పరిశీలిస్తున్న సీపీ

నవీపేట: నవీపేట పోలీస్ స్టేషన్‌ను సీపీ సాయి చైతన్య సోమవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. కంప్యూటర్ సెక్షన్, వాహనాల పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించారు. గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటుపై వీడీసీలకు అవగాహన కల్పించాలని నార్త్‌రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై వినయ్‌లకు సూచించారు. గ్రామ పోలీస్ అధికారులు విధులను పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. గంజాయి, మత్తుపదార్థాలపై ప్రత్యేక దృష్టిసారించాలని సూచించారు.

సైబర్ నేరాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

నవీపేట : మండలంలోని నాళేశ్వర్‌లో విలేజ్ పోలీస్ ఆఫీసర్ నారాయణ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై సోమవారం అవగాహన కల్పించారు. సైబర్ నేరాలతో పాటు గంజాయి, మత్తు పదార్థాలు అరికట్టడంలో పోలీసులకు సహకరించాలని కోరారు. అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం తెలిస్తే విలేజ్ పోలీస్ ఆఫీసర్, డయల్ 100, స్థానిక ఎస్సైకి సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఇసుక అక్రమ రవాణా కట్టడికి కృషి చేస్తున్న పోలీసులకు సహకరించా లని కోరారు. కార్యక్రమంలో ఎస్సై వినయ్, వీడీసీ ప్రతినిధులు, యువకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం



సేవాలాల్‌తండాలో భూమి పూజ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సిరికొండ: సిరికొండ జీపీ పరిధిలోని సేవాలాల్ తండాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు సోమవారం ప్రారంభించారు. కాంగ్రెస్ మైనార్టీ సెల్ మండలాధ్యక్షుడు ఆసిఫ్, బీసీ సెల్ కార్యదర్శి గ్యామ శోభన్, గ్రామ శాఖ అధ్యక్షుడు దిగంబర్, రాము తదితరులు పాల్గొన్నారు.